సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 27 । జూలై । 2023



రాజన్నకు వర్షం ఎఫెక్ట్

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు బుధవారం అంతగా రాకపోయేసరికి ఆలయం వెలవెలబోయింది.



ఆర్టీసీని ప్రైవేటీకరించొద్దు

సిరిసిల్లటౌన్: ఆర్టీసీని ప్రైవేటీకరించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. ఈమేరకు బుధవారం సిరిసిల్ల డిపో ఎదుట ధర్నా చేశారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ బదిలీ?



వెల్దండి సమ్మయ్య

సిరిసిల్లటౌన్: సుదీర్ఘకాలంగా సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెల్దండి సమ్మయ్య బదిలీ అయ్యారని సమాచారం. అధికారికంగా ఉత్తర్వులు వెలువడ లేదు. ఆయన స్థానంలో ప్రస్తుతం కోరుట్లలో విధులు నిర్వర్తిస్తున్న ఆయాజ్ రానున్నట్లు తెలిసింది. సమ్మయ్య సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా 2019, అక్టోబర్ 18న విధుల్లో చేరారు. దాదాపు నాలుగేళ్లు ఇక్కడ విధులు నిర్వర్తించారు. సెకండరీ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా సిరిసిల్లలో విధుల్లో చేరగా ఇటీవల ఫస్ట్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోషన్ పొందారు. అప్పుడే బదిలీ అవుతారన్న ఊహాగానాలు వెలువడినా కాలేదు. ప్రస్తుతం బదిలీ అనివార్యమైందని తెలిసింది.

వాసరవేణికి 'పెందోట' పురస్కారం



పర్శరాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రచనలతోపాటు పరిశోధన చేసి నిరంతరం బాలసాహిత్యంలో రచనలు చేస్తున్న డాక్టర్ వాసరవేణి పర్శరాములు పెందోట బాలసాహిత్య విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. సిద్దిపేటకు చెందిన పెందోట సాహిత్య సంస్థ ప్రకటించిన పురస్కారాన్ని ఆగస్టులో అందించనున్నట్లు తెలంగాణ వివేక రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపెన రమేశ్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన వాసరవేణి పర్శరాములు గత పన్నెండేళ్లుగా బాలసాహిత్యంలో అనేక రచనలు చేశారని తెలిపారు. ఆయన కృషిని గుర్తించి ఈ పురస్కారానికి పెందోట సంస్థ ఎంపిక చేసిందన్నారు. పర్శరామ్‌ను జిల్లాకు చెందిన కవులు జనపాల శంకరయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, రవి, లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

భూమి కోసం వాటర్ ట్యాంకెక్కిన రైతు



దేవయ్యను కాపాడిన ఎస్సై, ఏఎస్సై



ట్యాంక్‌పై దేవయ్య

కోనరావుపేట(వేములవాడ): తన భూమిని ఇతరులు సాగుచేసుకుంటున్నారని, తనకు ఇప్పించాలని కోరుతూ మండలంలోని రామన్నపేటకు చెందిన రైతు గడ్డం దేవయ్య బుధవారం వాటర్‌ట్యాంకెక్కాడు. రైతు తెలిపిన వివరాలు. దేవయ్యకు 13 ఎకరాల భూమి ఉంది. ఇటీవల సర్వే చేయించగా పక్కనే గల గడ్డం పద్మ, చీమల కొమురయ్య, కంది మల్లారెడ్డిల భూమిలోంచి దేవయ్యకు ఎకరం భూమి వచ్చింది. ఆ భూమి గురించి కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతోంది. తనకు వచ్చిన భూమిని ఇవ్వాలని దేవయ్య కోరగా గత ముప్పై ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఇవ్వమని వారు స్పష్టం చేశారు. బుధవారం సదరు వ్యక్తులు నాట్లు వేస్తుండడంతో దేవయ్య అడ్డుకోగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చేసేదేమి లేక దేవయ్య వాటర్‌ట్యాంక్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని బాధిత రైతుతో మాట్లాడి కిందికి దించారు. ఇరువర్గాలను పిలిపించి మాట్లాడుతామని హామీ ఇచ్చారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



వైజయంతి యుద్ధ ట్యాంకు వద్ద బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: కార్గిల్‌లో పాకిస్తాన్‌పై విజయోత్సవానికి చిహ్నంగా సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. స్థానిక కార్గిల్‌లేక్ కట్టపై గల వైజయంతి యుద్ధట్యాంక్ వద్ద జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం మాజీ సైనికులను సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, శీలం రాజు, గరిపెల్లి ప్రభాకర్, గాజుల వేణు, శ్రీగాథ మైసయ్య, మల్లడపేట భాస్కర్, మోర శ్రీనివాస్, ఊరగొండ రాజు పాల్గొన్నారు.

సర్వేల జోరు.. 'సోషల్' హోరు!

పార్టీలవారీగా నేతలు, అభిమానుల సర్వేలు



- సీఎం, ఎమ్మెల్సీ కవితను పోటీకి నిలిపిన సోషల్ మీడియా
- పొన్నం ప్రభాకర్ పార్టీ మారతారని ప్రచారం
- 'బండి' నిష్క్రమణ, కాంగ్రెస్ కరెంటువార్‌తో రీసర్వేలు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ అభిప్రాయ సేకరణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఎమ్మెల్యేలు, ఆశావహుల సర్వేలు జోరందుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లీడర్లు ఎవరికి వారుగా ఓటరు అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 13 అసెంబ్లీ స్థానాలకు గాను 10 టీఆర్‌ఎస్ గెలుచుకోగా మిగిలిన మూడింటిలో ఏఐఎఫ్‌బీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలిచారు. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమకు అందుబాటులో ఉన్న వివిధ శాఖల అధికారుల ద్వారా ప్రజల మూడ్ తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా తెలుసుకుంటున్నారు. పాతజిల్లాలో కొన్ని సోషల్‌మీడియా పేజీలు, హ్యాండిళ్లు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? అంటూ బహిరంగంగా ఫొటోలు పెట్టి మరీ అభిప్రాయం తెలుసుకోవడం విశేషం.

కరీంనగర్‌లో ఇద్దరు

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పుకున్నాక, ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ చేసిన వ్యాఖ్యల తర్వాత స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కమలాకర్ గంగుల సర్వే చేయించారు. అత్యంత గోప్యంగా నిర్వహించిన ఈ సర్వేతో బీఆర్‌ఎస్ గ్రాఫ్, 2018 ఎన్నికల కంటే 16 శాతం పెరిగిందని మంత్రి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటి వరకు కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి ఎవరన్నది తేలకపోవడం తమకు అనుకూలిస్తుందని బీఆర్‌ఎస్ వర్గాలు ధీమాగా ఉన్నాయి.

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ సర్వే ప్రారంభించారు. ప్రతీ గ్రామంలోని 100 మంది ఓటర్లను కలిసే బాధ్యతలను బీఆర్‌ఎస్ కార్యకర్తకు అప్పగించారు. వీరంతా పార్టీ మండలాధ్యక్షుడికి, మండలాధ్యక్షులంతా ఎమ్మెల్యేతో టచ్‌లో ఉంటారు. ప్రతీ కుటుంబంలో ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఏదైనా పథకం అందలేదా? ఈసారి ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? కులం, వృత్తి, ఫోన్‌నెంబర్లు అడిగి నోట్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తాజా ఓటర్లకు సమానమైన పేపర్లు ముద్రించి తీసుకురావడం గమనార్హం. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు, కార్యకర్తల స్థితిగతులను తెలుసుకునేందుకు వివరాల సేకరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే రసమయి వెల్లడించారు.

నేతలకు 'సోషల్' బెంగ

ఉమ్మడి జిల్లాలో సోషల్ మీడియా ప్రచారం ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపరుస్తోంది. ఫలానా స్థానం నుంచి ఫలానా సీనియర్ నేత పోటీ చేస్తారని ఊదరగొడుతున్నారు. ఇంకొందరు నేతల వీరాభిమానులు మీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరు? అంటూ ఫ్యాన్‌మేడ్ సర్వేల పేరిట ప్రధాన ప్రత్యర్థులు, ఎమ్మెల్యే ఆశావహుల ఫొటోలు పెట్టి ఓటింగ్‌కు వెళ్తున్నారు. ఇది అన్ని పార్టీల అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారింది.

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఏకంగా పార్టీ మారుతున్నారని, ఆయన హుస్నాబాద్ లేదా హుజూరాబాద్ నుంచి పోటీచేస్తారని కొన్నిరోజులుగా సోషల్ మీడియా ప్రచారం హోరెత్తింది. దీనిపై స్పందించిన పొన్నం ప్రభాకర్ తాను పార్టీ మారడం లేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొందరు కావాలని తనపై కుట్ర పూరితంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వదంతులను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.
- పెద్దపల్లిలో ఉన్నవే మూడు అసెంబ్లీ స్థానాలు. అందులో రామగుండం నుంచి ఎమ్మెల్సీ కవిత, పెద్దపల్లి నుంచి ఏకంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రచారం ప్రారంభించారు. అంతేకాదు వీరిద్దరూ ఆయా స్థానాల నుంచి బరిలోకి ఎందుకు దిగుతారో కూడా కారణాలు వివరిస్తుండటం విశేషం. పార్టీ కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత పెద్దపల్లి జిల్లా నేతలతో తీసుకున్న ఫొటోలను వీటికి జతచేస్తున్నారు. తద్వారా ఆయా ఎమ్మెల్యే వర్గాల్లో కలవరపాటుకు కారణమవుతోంది.
- సిరిసిల్లలో నేతల మధ్య ఎలాంటి వార్ లేదు. వేములవాడలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, అదే పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న చలిమెడ లక్ష్మీనరసింహారావు ఎవరికివారు సర్వేలు చేయించుకుంటున్నారు. ఈ రెండు గ్రూపుల మధ్య సోషల్‌వార్ వాడీవేడిగా నడుస్తోంది. జగిత్యాలలో ఎమ్మెల్యేల రహస్య సర్వే కొనసాగుతుండగా.. జిల్లాలో సోషల్ మీడియా వార్ అంతగా కనిపించడం లేదు.

ఠాణాకు వచ్చే వారితో మర్యాదగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట(సిరిసిల్ల): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, వారికి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్, జీడీ ఎంట్రీ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలని, గస్తీ, పెట్రోలింగ్ పెంచాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ గ్రామాల పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో కనీసం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్ ఉన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందునా ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నర్మాల ఎగువ మానేరు సందర్శనకు వెళ్లవద్దని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, రైతులు పొలాల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చెట్ల కింద, పాడయిన భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదన్నారు. చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటుందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేగంగా రైల్వేలైన్ భూసేకరణ

- ఇప్పటికే 808 ఎకరాలు సేకరించాం
- ఇంకా 148 ఎకరాలకు ఏర్పాట్లు
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణను వేగవంతం చేస్తామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తెలిపారు. కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ సమన్వయ కార్యదర్శి విజయ్ తివారీ బుధవారం ఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో రైల్వేలైన్ కోసం 956 ఎకరాలకు 808 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 148 ఎకరాల సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి రైల్వేశాఖకు అప్పగిస్తామని వివరించారు. పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ ఉపేందర్ రావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ రవి, కలెక్టరేట్ పర్యవేక్షకులు రమేశ్ పాల్గొన్నారు.

వందశాతం ప్రసవాలతో భ్రూణహత్యలకు చెక్

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వందశాతం ప్రసవాలు జరిగితే భ్రూణహత్యలను నిలువరించొచ్చని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కనీసం ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు ఉంటేనే మల్టీస్పెషాలిటీ వైద్యశాలగా పేరు పెట్టుకోవాలన్నారు. ఇప్పటికీ జిల్లాలో ప్రసవాలు 70 శాతానికి పైగా జరుగుతున్నాయని.. త్వరలోనే 80 శాతానికి పెంచుతామన్నారు. జిల్లాలో 105 ఆస్పత్రులు, 25 స్కానింగ్ సీటీసీ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిటీ సభ్యులు వైద్యులు రజిత, మహేశ్, శోభారాణి, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, చింతోజు భాస్కర్, టమటం రామానుజమ్మ, బాలయ్య పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలకు చెందిన మహిళ శ్రీధర్ల దేవవ్వ(57) పాముకాటుతో బుధవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవవ్వ బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చింది. ఒంటరి మహిళ కావడంతో ఇంటి తాళం చెవిని ఆవరణలోని గోనె సంచి కింద భద్రపర్చుకుంది. సాయంత్రం ఇంటి తాళం తీసేందుకు గోనె సంచి కింద చేతులు పెట్టగా పాము కాటువేసింది. చుట్టుపక్కల వారు స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వేములవాడకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే వృద్ధురాలు మృతిచెందింది. మృతురాలి భర్త చిన్నన్న ఇరువై ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఒక్కగానొక్క కూతురుకు పెళ్లి అయ్యింది.

తుంపర వాన.. ప్రజల హైరానా



పొంగుతున్న నర్మాల ఎగువమానేరు



జలదిగ్బంధంలో సిరిసిల్లలోని శ్రీనగర్‌కాలనీ

- మత్తళ్లు దూకిన ఎగువమానేరు
- తంగళ్లపల్లిలో అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు
- రుద్రంగిలో అత్యల్పంగా 7.5 మిల్లీమీటర్లు
- రైతులు జాగ్రత్తగా ఉండాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల మానేరువాగు వద్ద చేపల వేట



సింగసముద్రంలోకి చేరుతున్న వరదనీరు

సిరిసిల్ల: జిల్లా అంతటా ముసురువర్షం కొడుతోంది. బుధవారం తెల్లవారుజాము నుంచే వర్షం మొదలైంది. వర్షంతో జిల్లాలో జనజీవనం స్తంభించింది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నిండింది. కుడి, ఎడమ వైపు ఉన్న రెండు మత్తళ్లు దూకుతున్నాయి. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం ఇప్పటికే నిండి మత్తడి దూకుతోంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వర్షాలతో జనజీవనం స్తంభించింది.

రైతులు జాగ్రత్తగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్ నుంచి బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వైర్లను, స్టార్టర్ బాక్స్‌లను చేతులతో తాకొద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని, వాగులు, ఒర్రెల్లో చేపలు పట్టేందుకు, జలాశయాలను, చెరువులను చూసేందుకు వెళ్లవద్దని సూచించారు. మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లొద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. మానేరు, మూలవాగు పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పాత ఇళ్లల్లో జనం ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైన ఆపద వస్తే 93986 84240 నంబర్‌లో తెలపాలని కోరారు. జిల్లా అధికారులు హెడ్‌క్వార్టర్‌ను విడిచి పోవద్దన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతోంది. జలాశయానికి జీవనాధారమైన సిద్దిపేట జిల్లా కూడవెల్లివాగు, కామారెడ్డి జిల్లా పాల్వంచవాగుల ద్వారా వరదనీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు ఉప్పొంగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 31 అడుగులు. ప్రాజెక్టు సందర్శనకు పర్యాటకులు రావొద్దని గంభీరావుపేట ఎస్సై మహేశ్ తెలిపారు. రోడ్లపై బారికేడ్లతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సింగసముద్రంలో జలకళ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం వరదనీటితో జలకళను సంతరించుకుంది. సింగసముద్రంలోకి పెద్ద ఎత్తున వరదనీరు చేరుతోంది. నీటి సామర్థ్యం 26 ఫీట్లు కాగా ప్రస్తుతం 19 ఫీట్లకు నీరు చేరింది.

మిడ్‌మానేరులో 16 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. చెరువులు, చిన్నతరహా ప్రాజెక్టులు నిండి మత్తళ్లు దూకుతున్నాయి. ఆ జలసోయగాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 16.65 టీఎంసీలకు చేరింది. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 5,100 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లో‌గా వస్తోంది. ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 1,530 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

వర్షపాతం ఇలా..(మి.మీ)


తంగళ్లపల్లి	52.6
రుద్రంగి	7.5
గంభీరావుపేట	15.4
బోయినపల్లి	17.2
చందుర్తి	10.6
వేములవాడరూరల్	14.4
వేములవాడ	29.6
సిరిసిల్ల	32.7
కోనరావుపేట	11.7
వీర్నపల్లి	14.2
ఎల్లారెడ్డిపేట	11.9
ముస్తాబాద్	14.6
ఇల్లంతకుంట	38.6

జాలువారిన గొర్రెగుండం



సీమర్లు జలపాతం

రుద్రంగి(వేములవాడ): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రుద్రంగి మండలం మానాల వద్ద గల గొర్రెగుండం జలపాతం బండరాళ్లపై నుంచి జాలువారుతోంది. రుద్రంగి శివారులోని అటవీప్రాంతంలో గల సీమర్లు జలపాతం చిందులేస్తుంది.



గొర్రెగుండం జలపాతం

క్లుప్తంగా

డీఈవోకు వినతి


దీఈవోకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగార్థులు

సిరిసిల్లక్రైం : ప్రభుత్వం ప్రకటించనున్న ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియకు అవసరమైన నివేదికలు గతంలో తయారు చేశారని, కానీ మళ్లీ నూతన నివేదికల పేరిట హేతుబద్ధీకరణ జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందని, అలాంటి చర్యలకు వెళ్లవద్దని ఉద్యోగార్థులు డీఈఓ రమేశ్ కుమార్ బుధవారం వినతిపత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తారన్న ఆశాభావంతో ఉన్నారని, మళ్లీ పోస్టులను తగ్గిస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జి.మౌనిక, సమ్రీన్, జి. సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మగుండంలో పెరిగిన నీటిమట్టం



వేములవాడ : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ రాజన్న ఆలయ చెరువులోకి వర్షపునీరు వచ్చి చేరింది. దీంతో స్వామివారి ధర్మగుండం నీటి మట్టం అమాంతం పెరిగిపోయింది.

సెలవు దినాలు పని దినాలుగా ప్రకటించాలి


లేఖ పంపుతున్న బాల్‌రాజ్ యాదవ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో కుండపోతగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ఇవ్వగా, సెలవు దినాలను పని దినాలుగా చేయాలని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ బుధవారం సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు సీఎంకు పోస్టు ద్వారా ఒక లేఖను పంపారు. సెలవు దినాలను పనిదినాలుగా మార్చితే పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ఈ విషయంలో సీఎం కీలక నిర్ణయం ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును మార్చుతుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే జీవో అమలు చేయాలని కోరారు.

సన్మానం


వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జాతీయ ఉత్తమ సామాజిక సేవా కార్యకర్తగా ఈనెల 31న ఢిల్లీలో అవార్డు అందుకోనున్న ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డిని గ్రామస్తులు, వివిధ కుల సంఘాలు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మరిన్ని జాతీయ అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తోబుట్టువులే కాలయములు

- అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించిన వైనం
- ధర్మారం మండలం కొత్తూరులో ఘాతుకం
- ఘటనాస్థలిలోనే బాధితుడి మృతి
- ఇచ్చిన డబ్బులడగడం, వివాహేతర సంబంధానికి అడ్డురావడమే కారణం


అశోక్ (ఫైల్)


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ధర్మారం: డబ్బుపై ఆశ.. వివాహేతర సంబంధం కారణంగా వారికి రక్త బంధం గుర్తు రాలేదు.. తోబుట్టువులే కాలయములై ఇంట్లో నిద్రిస్తున్న తమ అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించి, కడతేర్చారు.. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన గాలిపెల్లి బక్కయ్య–వినోద దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు పుష్పలతను సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లికి చెందిన బైరి అనిల్‌కు ఇచ్చి, వివాహం చేశారు. పెద్ద కుమారుడు అశోక్(36) ఐదేళ్లు దుబాయిలో ఉండి, పది నెలల క్రితమే స్వగ్రామం వచ్చాడు. అతని తమ్ముడు నరేశ్ జూలపల్లి మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అశోక్ దుబాయిలో ఉంటూ సంపాదించిన డబ్బులను తన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. వాటితో నరేశ్ ధర్మారం మండల కేంద్రంలో రెండు గుంటల భూమి కొనుగోలు చేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తండ్రి బక్కయ్య అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో ఇంటి వ్యవహారాలు చూసుకున్నాడు.

తమ్ముడికి వివాహేతర సంబంధం..

ఈ క్రమంలో కొత్తూరుకే చెందిన ఓ వివాహితతో అశోక్ తమ్ముడు నరేశ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెను ఇంటికి తీసుకువస్తానని దుబాయి నుంచి వచ్చిన తన అన్నతో చెప్పాడు. దీనికి అతను కుటుంబానికి చెడ్డ పేరు వస్తుందని, తనకు పెళ్లి కావాల్సి ఉందని అభ్యంతరం చెప్పాడు. నరేశ్ ప్రవర్తన నచ్చని అశోక్ తాను పంపించిన డబ్బుల లెక్క చెప్పాలని నిలదీశాడు.

డబ్బులు తిరిగి ఇవ్వాలని చెల్లి, బావపై ఒత్తిడి

అశోక్ తన బావ అనిల్‌కు కూడా అవసరం నిమిత్తం దుబాయి నుంచి డబ్బులు పంపించాడు. వాటిని తిరిగి ఇవ్వాలని చెల్లి పుష్పలత, బావపై ఒత్తిడి చేశాడు. దీంతో ఎలాగైనా అశోక్‌ను చంపాలని నరేశ్, పుష్పలత, అనిల్ నిర్ణయించుకున్నారు. 20 రోజుల క్రితం రాత్రి అతను ఇంట్లో నిద్రిస్తుండగా దాడి చేశారు. ఈ విషయమై అశోక్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది కుటుంబ వ్యవహారంగా భావించిన పోలీసులు కులపెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకొని, కలిసి ఉండాలని సూచించారు.

స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు..

5 రోజుల క్రితం కులపెద్దలు అశోక్, నరేశ్‌లను పిలిపించి తల్లిదండ్రులు బతికున్నంత కాలం ఆస్తుల జోలికి వెళ్లవద్దని, చెరో రూ.లక్ష వారి వద్ద నుంచి తీసుకోవాలని సూచించారు. దీనికి అన్నదమ్ములిద్దరూ అంగీకరించారు. అయితే తనకు ప్రాణహాని ఉందని అనుమానించిన అశోక్ ఇంటికి రాకుండా గ్రామంలోని స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు. దీంతో బయట ఎందుకు ఉంటున్నావని ఇంటికి వెళ్లి, కలిసి ఉండాలని కుల పెద్దలు సూచించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున నరేశ్, పుష్పలత, అనిల్ అతను బయటకు రాకుండా తలుపు గడియపెట్టారు.

కిటికీలో నుంచి నిప్పంటించారు..

నిద్రలో ఉన్న అశోక్‌పై కిటికీలో నుంచి పెట్రోల్ పోసి, నిప్పంటించారు. మంటలకు అశోక్ లేచి, బయటకు వచ్చే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వరుసకు అన్న అయిన కొక్కుల రాంనారాయణ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పరిశీలించి, వివరాలు సేకరించారు. నరేశ్, పుష్పలత, అనిల్‌పై స్థానికులు దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకొని, పోలీస్ వాహనంలో ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'సబ్బితం'లో మునిగి యువకుడి మృతి

- ఈత కొట్టేందుకు జలపాతంలో దిగడంతో ఘటన
- కళ్లముందే జరగడంతో కన్నీరుమున్నీరైన స్నేహితులు
- మృతుడు కరీంనగర్‌వాసి


వెంకటేశ్ (ఫైల్)


మృతదేహాన్ని తీసుకువస్తున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం పంచాయతీ పరిధి గౌరీగుండాల జలపాతం అందాలను చూసేందుకు స్నేహితులతో వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. కళ్ల ముందే మునిగిపోయాడని అతని మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేశ్(24) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులు అభిలాష్, రాకేశ్, భరత్, అఖిల్‌తో కలిసి గౌరీగుండాల జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ అందరూ కలిసి ఫొటోలు దిగారు. తర్వాత ఈత కొట్టేందుకు నీటిలో దిగారు. కొద్దిసేపటికే నీటి ఉధృతికి వెంకటేశ్ మునిగిపోయాడు. అతని స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఎస్సై మహేందర్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో జలపాతం వద్దకు వచ్చారు. రెండు గంటలపాటు శ్రమించి, వెంకటేశ్ మృతదేహాన్ని వెలికితీశారు. తన కుమారుడు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి, బయల్దేరాడని, ఇలా జలపాతంలో శవమయ్యాడంటూ మృతుడి తండ్రి రాజేశం రోదించారు. ఈ ఘటనతో పోలీసులు పొక్లెయిన్ తెప్పించి, జలపాతం వైపు వెళ్లకుండా కందకం తవ్వించారు.

ఆరేళ్లలో 15 మంది..

గౌరీగుండాల జలపాతంలో మునిగి, ఆరేళ్లలో 15 మంది చనిపోయారు. ఐదేళ్ల క్రితం ఫారెస్ట్ అధికారులు తాత్కాలికంగా రక్షణ కోసమంటూ పైభాగంలో రెయిలింగ్ ఏర్పాటు చేసినా కొద్దిరోజులకే తొలగించారు. జలపాతం వద్దకు వచ్చే పర్యాటకులు నీటిలోకి దిగకుండా దూరంనుంచే చూసేలా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అండగా ఉంటాం

- కొమిరె సంజీవ్ కుటుంబానికి బాసటగా నిలుస్తాం
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- సిరిసిల్లలో సంస్మరణ సభ


సంజీవ్ భార్య లతకు చెక్కు అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బండారు కల్యాణ మండపంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు కొమిరె సంజీవ్ సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 2009 నుంచి సంజీవ్ పార్టీ కోసం పనిచేశారని, టెక్నాలజీ వాడటంలో ముందుండే ఆయన అకాల మరణం తీరని లోటన్నారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ కొమిరె సంజీవ్ తమ కుటుంబ సభ్యుడిలా ఉండేవారని, ఆయన కుటుంబాన్ని పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. సంజీవ్ కూతురు చదువులకు మంత్రి కేటీఆర్ సాయం చేస్తామని చెప్పారని వివరించారు. బీఆర్ఎస్ తరఫున రూ.2లక్షల చెక్కును సంజీవ్ భార్య లత, కూతురు స్నేహితకు అందించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, ×సెస్× డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అగ్గి రాములు, విజయేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాయకులు ఆకునూరి దేవయ్య, కమ్మరి తిరుపతి, నక్క శ్రీకాంత్, పూడూరి సంజీవ్‌లు ఆలపించిన గీతాలు కన్నీళ్లు పెట్టించాయి.

పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

- డీఈవో రమేశ్‌కుమార్


ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తున్న డీఈఓ

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో సమగ్ర అభివృద్ధి సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట ప్రభుత్వ పాఠశాలలో రెండు రోజుల జిల్లా స్థాయి శాలసిద్ధి వర్క్‌షాప్ ప్రారంభించారు. జిల్లాలో ఎంపికైన 31 పాఠశాలల నుంచి స్కూల్‌కు ఇద్దరి చొప్పున హాజరైనట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో సెల్ఫ్ ఎవల్యూయేషన్ దృష్టితో ప్రణాళికలు తయారు చేసుకొని పాఠశాల సమగ్ర అభివృద్ధికి సమష్టి కృషి జరగాలన్నారు. సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్లు విద్యాసాగర్, పద్మజ, శైలజ, వెంకన్న, సీఆర్పీలు అనురాధ, మధు, ప్రవీణ్ పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ ఫేజ్‌ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

వేములవాడఅర్బన్: విద్యార్థులు దోస్త్–2023 స్పెషల్ ఫేజ్‌ను వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వద్దూరి శ్రీనివాస్ కోరారు. స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 1 నుంచి 11వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. 12 వరకు వెబ్ ఆప్షన్, 16 వరకు సీట్ల కేటాయింపు, 19 వరకు కళాశాలలో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేసుకున్న ఏ కళాశాలలో సీట్ పొందని వారు మాత్రమే స్పెషల్ ఫేజ్‌కు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల్లో కనీస అభ్యసన స్థాయి ఉండాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయిలు ఉండాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శైలజా పేర్కొన్నారు. కనీసన అభ్యసన స్థాయిని పెంచడానికి ప్రభుత్వ అమలు చేస్తున్న తొలిమెట్టుపై జిల్లాస్థాయి తొలిమెట్టు రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమానికి డీఈవో హాజరై ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన మండల స్థాయి తొలిమెట్టు రిసోర్స్ పర్సన్లకు స్థానిక గీతానగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ శిబిరంలో అందుకున్న మెలకువలను పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. గీతానగర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం భాగ్యరేఖ, జిల్లా రిసోర్స్ పర్సన్లు రమానాథ్‌రెడ్డి, రవీందర్, శర్మ, భాస్కర్‌పాల్గొన్నారు.

డీసీఆర్బీ సీఐగా రఘుపతి

సిరిసిల్లక్రైం : జిల్లా డీసీఆర్బీ సీఐగా రఘుపతిని నియమిస్తూ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇంతకు ముందు డీసీఆర్బీ సీఐగా విధులు నిర్వహించిన కృష్ణకుమార్ వేములవాడ రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సీఐ రఘుపతిని జిల్లా డీసీఆర్బీ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఉద్యమ కారులపై కేసులు ఎత్తివేయాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కోసం ఉద్యమించిన వారిపై ప్రభుత్వం కేసులు వెంటనే ఎత్తివేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఉద్యమ నేతలు సిరిసిల్లలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఏర్పాటుకు అప్పటి ప్రతిపక్షాలు, విద్యావంతులు, విద్యార్థులు, న్యాయవాదులు, సబ్బండ వర్గాల ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టామని, సీఎం కేసీఆర్ జిల్లా ఏర్పాటుకు అంగీకరించారన్నారు. ఉద్యమకారులు అన్నల్ దాస్ వేణు, వీరవేణి మల్లేశం, కంసాల మల్లేశం, తిరుపతి, సీహెచ్.పోప్ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి


మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ పునరుద్ధరించాలని సంకల్ప రథయాత్రకు మద్దతుగా సిరిసిల్లలో గీతానగర్ హైస్కూల్‌లో వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాత పింఛన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని, లేకపోతే ఉద్యోగులకు భద్రత లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వివిధ సంఘాల నాయకులు పీఆర్‌టీయూ (టీ) నాయకులు నీలి శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్ రెడ్డి, టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, డీటీఎఫ్ బాధ్యులు తడుక సురేశ్, టీపీయూస్ బాధ్యులు కనుకయ్య, యూటీఎఫ్ బాధ్యులు అక్కపల్లి యాదగిరి గౌడ్, జీటీయూ బాధ్యులు హరిప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తిరుపతి, సత్తు రవీందర్, జక్కని నవీన్, దేవేందర్, రాజేశం పాల్గొన్నారు.


సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం చొరవ చూపాలి

వేములవాడఅర్బన్: సీపీఎస్ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర బుధవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్థానిక కోరుట్ల బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్‌ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో అటు ప్రభుత్వానికి, ఇటు ఉద్యోగులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. తక్షణం ఉపసంహరించుకొని.. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, నీలం సురేందర్, ఎడ్ల కిషన్, వంగ తిరుపతి, రామచంద్రం, శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వేములవాడఅర్బన్: ఆర్టీసీ డిపో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు పేర్కొన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం నిరసన తెలిపారు. రాములు మాట్లాడుతూ కార్మికులపై భారం తగ్గించాలన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎల్లా దేవరాజు, గాజుల పోశెట్టి, కోరెపు శ్రీనివాస్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న మినీ ఐలాండ్


మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మినీ ఐలాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మిడ్ మానేరు బ్యాక్ వాటర్ గోపాలరావుపల్లె శివారులో మినీ ఐలాండ్ అదిరిపోయింది. అచ్చం సినిమాల్లో చూపించేలా చుట్టూ నీటి మధ్యలో పెద్ద రాళ్లు, ఒక చిన్న పెంకుటిల్లు, దాని పక్కనే పచ్చని ఈత చెట్టు ఆకట్టుకుంటోంది. మినీ ఐలాండ్‌ను చూసి అందరూ ఆహా.. అంటున్నారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించండి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలం బండలింగంపల్లిలో వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యదర్శి సురేశ్‌కు విన్నవించారు. గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయని తెలిపారు. చిన్న పిల్లలపై, పెంపుడు జంతువులపై దాడులు చేస్తున్నాయన్నారు. తాజాగా బుధవారం సాయిబాబా మందిరం వద్ద లేగదూడపై దాడి చేసి హతమార్చాయన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

సారు మంచోడే.. తొత్తుగాళ్లతోనే తిప్పలు

- మంత్రి కేటీఆర్ కోటరీపై గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడి ఫైర్
- వైరల్‌గా మారిన గోవర్ధన్‌గౌడ్ వాయిస్


గోవర్ధన్ గౌడ్


మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల: 'సారు మంచోడే.. ఈ తొత్తుగాళ్లతో తిప్పలు.. సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించాలని ఆయన కింద పనిచేసేటోళ్లు చూస్తుండ్రు..' అని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్ ఆడియో జిల్లాలో బుధవారం వైరల్‌గా మారింది. మంత్రి కేటీఆర్‌ను కలుస్తామంటే ఆయన కింద పనిచేసే కోటరీ తమను కలువనీయడం లేదని, సిరిసిల్లలో సర్వాయిపాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో నాలుగెకరాల స్థలం, రూ.4 కోట్లు ఇస్తామని మంత్రి కేటీఆర్ చెప్పినా.. ఏదీ కాలేదన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 'కేటీఆర్‌కు హఠావో.. సిరిసిల్లకు బచావో' అంటూ ఆందోళన చేస్తామని హెచ్చరించడం కలకలం రేపింది. తనకు ఏ పదవులు అక్కరలేదని, గౌడ కులస్తుల కోసం పనిచేస్తానని గోవర్ధన్‌గౌడ్ పదే పదే చెబుతూనే.. మంత్రి కేటీఆర్ పీఏను, పార్టీ జిల్లా నాయకుడిని నిందించడం చర్చనీయాంశమైంది. ఓ మేజర్ పంచాయతీ సర్పంచ్ ఇళ్ల పర్మిషన్లకు రూ.లక్షలు తీసుకుంటున్నాడని ఆరోపించారు. గౌడకులస్తులవీ 30 వేల ఓట్లు ఉన్నాయంటూ గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

గోవర్ధన్‌గౌడ్‌పై సర్పంచ్ ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్‌పై ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆఫీస్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ మంత్రిపై మాట్లాడే అర్హత గోవర్ధన్‌గౌడ్‌కు లేదన్నారు. ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడిన : గోవర్ధన్‌గౌడ్

గౌడ సామాజికవర్గానికి తగిన న్యాయం జరగడం లేదని, సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటులో జాప్యమవుతుందనే ఆవేదనతో ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడినట్లు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్ ఆడియో రిలీజ్ చేశారు. మంత్రి కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ జిల్లా నాయకులతో తనకు ఎలాంటి అభిప్రాయ బేధాలు లేవని స్పష్టం చేశారు.

సైనికులను స్మరించుకునేందుకే కార్గిల్ విజయ్ దివస్


నివాళి అర్పిస్తున్న తుల ఉమ, తదితరులు

చందుర్తి(వేములవాడ) : దేశ భద్రతకోసం వీర మరణం పొందిన సైనికులను స్మరించుకునేందుకే కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ అన్నారు. మండలంలోని మల్యాలలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కార్గిల్ విజయ్ దివస్‌లో జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాక్ సైన్యంతో వీరోచితంగా వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించారు. లోకోజీ సతీశ్, పాటి సుధాకర్, మోత్కుపల్లి మధు, దుర్శేటి రాజు, పత్తిపాక శ్రీనివాస్, మూడపల్లి ముఖేశ్, గొల్లపల్లి సాయికృష్ణ, లచ్చయ్య, గోగులకొండ శివసాయి, బర్రి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే బీఆర్ఎస్ ఓటమి

- కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్


నియామక పత్రం అందిస్తున్న రవీందర్

ముస్తాబాద్(సిరిసిల్ల): బీసీలు ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ అన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ బీసీ సెల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఎలాంటి పథకాలను అమలు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి, బీసీబంధు అమలు చేయలేదన్నారు. అర్హులైన బీసీలకు కనీసం డబుల్ బెడ్‌రూం, పింఛన్లు ఇవ్వలేదన్నారు. బీసీలు కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలన్నారు. ఈసందర్భంగా బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా శీల ప్రశాంత్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, బాను, వుచ్చిడి బాల్‌రెడ్డి, మహేశ్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనిల్, నరేశ్, విజయ్‌రెడ్డి, భానుచందర్, శివ, కల్యాణ్, మారుతి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప రామకృష్ణకు తప్పిన ప్రమాదం

వేములవాడ : బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కారుకు బుధవారం ఉదయం భోపాల్‌లో ప్రమాదం జరిగింది. డివైడర్ మధ్యలోంచి రెండు ఆవులు రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. విషయాన్ని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావుకు తెలపడంతో సియార్ ఎమ్మెల్యే సుధాన్షురాయ్, అక్కడి బీజేపీ శ్రేణులు రామకృష్ణను పరామర్శించి ప్రాథమిక చికిత్స అందించి మరో వాహనంలో వేములవాడకు పంపించే ఏర్పాట్లు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలోని బెలూన్స్ ఓపెన్ కావడంతో అందరూ క్షేమంగా బయటపడినట్లు ఆయన బంధువులు తెలిపారు. అందరూ సురక్షితంగా ఉండటంతో రామకృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, పార్టీ శ్రేణులు, వేములవాడ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి


సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజాప్రతినిధులు సహకరించాలని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. నేరాల నియంత్రణకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముక్క శంకర్, కదిరె శ్రీనివాస్, మహేందర్, ఎంపీటీసీ ఎలగందుల నర్సింలు పాల్గొన్నారు.